క్లుప్తంగా

విద్యతోనే ఉత్తమ భవిష్యత్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై రామలింగేశ్వరరావు

కొత్తపల్లి: విద్యతోనే ఉత్తమ భవిష్యతని, ప్రతి ఒక్కరూ తమ పిల్లలను చదివించాలని ఎస్సై రామలింగేశ్వరరావు అన్నారు. కుతుకుడుమిల్లి శివారు నిదానం దొడ్డిలో మంగళవారం రాత్రి వారధి కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదాలు, మహిళా భద్రత, పోలీసుల విధులపై చిత్రీకరించిన వీడియోను ప్రదర్శించారు. ఎస్సై మాట్లాడుతూ పోలీసులు ప్రజలకు మధ్య దూరాన్ని తగ్గించేందుకు జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమర్ ఈ వారధి కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. రోడ్డు ప్రమాదాలకు ముఖ్య కారణంగా మద్యం సేవించడం, అతి వేగం, ముగ్గురు ప్రయాణించడమేనన్నారు. మహిళలకు రక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. అనంతరం వారధి కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం వివరించారు. కార్యక్రమంలో ఏఎస్సై సత్యనారాయణ, సర్పంచ్ కర్రి చిన్నారావు, ఎంపీటీసీ రాయుడు విష్ణమూర్తి తదితరులు ఉన్నారు.

వైఎస్సార్ సీపీ బీసీ సెల్ అధ్యక్షుడిగా పుట్టా



దొరబాబును కలసిన బీసీ సెల్ అధ్యక్షుడు వెంకట్రావు

పెద్దాపురం: నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడిగా పుట్టా వెంకట్రావును నియమించినట్లు పార్టీ కార్యాలయం మంగళవారం ఓ ప్రకటనలో విడుదల చేసింది. మండలంలోని రాయభూపాలపట్నానికి చెందిన వెంకట్రావు పార్టీలో సీనియర్ నాయకుడిగా కొనసాగుతున్నారు. గత టీడీపీ జెడ్పీటీసీపై వైఎస్సార్ సీపీ నుంచి పోటీ చేసి స్వల్ప మెజార్టీతో ఓటమి పాలయ్యారు. అయినా పార్టీ అభివృద్ధికి ఆయన అందిస్తున్న సేవలను గుర్తించి పార్టీ అధిష్టానం ఈ పదవిలో నియమించింది. వెంకట్రావు హౌసింగ్ చైర్మన్ దవులూరి దొరబాబును మర్యాద పూర్వకంగా కలసి కృతజ్ఞతలు తెలిపారు.

రేపు జునోసిస్ డే

సామర్లకోట: మండల పశువైద్య కేంద్రంలో గురువారం జునోసిస్ డే నిర్వహిస్తున్నట్టు లయన్స్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు చిత్తూలూరి వీర్రాజు, స్థానిక క్లబ్ అధ్యక్షుడు కానుబోయిన విజయకృష్ణ తెలిపారు. ఈ మేరకు కుక్కల నుంచి రేబిస్ సంక్రమించకుండా యాంటి రేబిస్ వ్యాక్సిన్ వేయనున్నట్టు చెప్పారు పట్టణ పరిధిలోని పెంపుడు కుక్కల యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రేపు, ఎల్లుండి ఉపవాస ప్రార్థనలు

పెద్దాపురం: ప్రపంచ శాంతికై ఏటా క్రీస్తు శాంతి ప్రార్థన మందిరాల్లో నిర్వహించే ఉపవాస ప్రార్థనల్లో భాగంగా గురు, శుక్రవారాల్లో పిఠాపురం మండలం విరవలో ఉపవాస ప్రార్థనలు నిర్వహించనున్నట్లు ప్రార్థనా మందిరం వ్యవస్థాపకులు నంగిన సత్యానందం తెలిపారు. మంగళవారం ఆయన క్రిస్టియన్ గాస్పల్ మినిస్ట్రీస్ (సీజీఎం) వ్యవస్థాపకులు నంగిన శామ్యూల్ సుదీప్‌తో కలిసి స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ప్రపంచంలో నెలకొన్న అశాంతి తొలగిపోయి శాంతికర వాతావరణం నెలకొల్పాలని ఐదు నెలల పాటు ఉపవాస ప్రార్థనలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

ఘనంగా వంగవీటి జయంతి

కొత్తపల్లి: పేద, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి దివంగత వంగవీటి మోహనరంగా 76వ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఊర చెరువు సెంటర్‌లో ఉన్న వంగవీటి విగ్రహానికి పలువురు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. వాకతిప్ప, కొండెవరంతో పాటు పలు గ్రామాల్లో అభిమానులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

కాకినాడ వెళ్లి పింఛన్ అందజేసి



జీజీహెచ్‌లో పింఛన్ అందజేస్తున్న వలంటీర్ విజయ

పెద్దాపురం: ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా అమలు చేస్తున్న పింఛన్ల పంపిణీకి వలంటీర్ల స్వచ్ఛంద సేవ మరింత తోడ్పడుతోంది. మండలంలోని కాండ్రకోటకు చెందిన సామాల దేవి అనారోగ్యంతో కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతోంది. ఈ విషయం తెలుసుకున్న వలంటీర్ శానపల్లి విజయ ఆస్పత్రికి వెళ్లి ఆమెకు పింఛను అందజేశారు. వలంటీర్లు అందిస్తున్న సేవ, ప్రభుత్వం ఏర్పాటు చేసిన వలంటీర్ వ్యవస్థపై దేవి ఆనందం వ్యక్తం చేసింది.

ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు



కొత్త ఇసుకపల్లిలో ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- కొత్త ఇసుకపల్లిలో 'గడప గడపకూ'

కొత్తపల్లి: ప్రభుత్వం ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందిస్తోందని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. కొత్త ఇసుకపల్లి గ్రామంలో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. పథకాల వల్ల వారు పొందిన లబ్ధిని వివరించారు. గ్రామంలో సమస్యలను తెలుసుకొని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుభిక్షమైన పాలన అందిస్తున్నారన్నారు. సచివాలయం, వలంటీర్ వ్యవస్థలతో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు చేరేలా కార్యక్రమలు అమలు చేస్తున్నారన్నారు. చంద్రబాబు ఎప్పుడైన పేదల సంక్షేమం గురించి పట్టించుకోలేదన్నారు. చంద్రబాబు హయంలో పథకాలన్నీ జన్మభూమి కమిటీల సిపారులతో టీడీపీ నాయకులకే అందేవన్నారు. సంక్షేమాన్ని పూర్తిగా పక్కన పెట్టి కేవలం కార్పొరేట్ వ్యవస్థల్లో కేవలం తన సామాజిక వర్గానికి పెద్దపీట వేస్తూ సామాన్యుడిని విస్మరించారన్నారు. జగన్ ప్రభుత్వం అలా కాదు ముందు పేదవాడి సంక్షేమం గురించే పనిచేస్తోందన్నారు. ప్రజలు, రైతుల కోసం అనేక పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కొత్త ఇసుకపల్లి, పాత ఇసుకపల్లి సర్పంచులు తమిలిశెట్టి సుబ్బారెడ్డి, సన్నిబోయిన రిబ్కా, పార్టీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్, గ్రామ సచివాలయ కర్వీనర్ చెరుకురి వీరబాబు, గుర్రాల కామేశ్వరరావు, చింతపల్లి కృష్ణరెడ్డి, చెరుకురి నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమం

పెద్దాపురం : ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు అన్నారు. మంగళవారం స్థానిక రెండో సచివాలయం పరిధిలో 3, 28, 29 వార్డుల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి, అగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, గృహ సారధుల మండల కన్వీనర్ గోపు మురళి, సచివాలయ సిబ్బందితో కలసి గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించి లబ్ధిదారులకు అందుతున్న పథకాలను వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, టీపీఓ ఉమామహేశ్వరరావు, కౌన్సిలర్లు గడపా రామలక్ష్మి, త్సలికి సత్యభాస్కర్, విడదాసరి రాజా, ఆరెళ్ళి వీర్రాఘవులు, ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పరికరాలు సద్వినియోగం చేసుకోవాలి

సాక్షి ఇంపాక్ట్



వేట్లపాలెం పంచాయతీకి ఫ్యాగింగ్ మెషీన్ అందజేసిన దవులూరి దొరబాబు, ఎంపీపీ తదితరులు

సామర్లకోట: పంచాయతీలకు అందజేసిన పారిశుధ్య పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. గత నెల 21న సాక్షిలో 'పారిశుధ్య పరికరాలపై నిర్లక్ష్యం' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌తో చర్చించి మంగళవారం మండల ప్రజాపరిషతు కార్యాలయంలో ఫాగింగ్ మెషీన్లు, ఇన్సినేటర్లు పంపిణీ చేయడానికి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రజా ప్రయోజనాల కోసం ప్రభుత్వం అందజేస్తున్న పరికరాలను సద్వినియోగం చేసుకొని ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని ఆయన సూచించారు. ఫాగింగ్ మెషీన్లను అచ్చంపేట, బోయనపూడి, జి.కొత్తూరు, హుస్సేన్‌పురం, కాపవరం, పి.వేమవరం, పవర, ఉండూరు, వేట్లపాలెం గ్రామాలకు, ఇన్సినేటర్లు బోయనపూడి, జి.కొత్తూరు, జి.మేడపాడు, కాపవరం, మాధవపట్నం, పవర, ఉండూరు, వేట్లపాలెం గ్రామాలకు అందజేశారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు అధ్యక్షత వహించగా ఎంపీడీఓ డి.శ్రీలలిత, ఈఓ పీఆర్డీ కర్రి హరిరామ సత్యకృష్ణరెడ్డి, ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య, సొసైటీ అధ్యక్షుడు వీరంరెడ్డి నాని, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

తప్పులు లేని ఓటర్ల జాబితా



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ మహేష్‌కుమార్

కాకినాడ: తప్పులు లేని ఓటర్ల జాబితా రూపొందించేందుకు సంబంధిత బీఎల్‌ఓలు, అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ సూచించారు. మంగళవారం ఆయన ఏటిమొగలో పర్యటించి అక్కడ కొన్ని నివాసాల్లోని ఓటర్ల జాబితాను తనిఖీ చేశారు. 47-3-25/18 డోర్ నెంబర్‌లో 44 ఓట్లు ఉన్నట్టు గుర్తించారు. వేర్వేరు కుటుంబాలు ఉన్నప్పటికీ డోర్ నెంబర్లు విడిగా లేకపోవడం వల్ల ఒకే చోట చూపిస్తున్నట్టు తేల్చారు. ఆయా కుటుంబాలకు వేర్వేరు డోర్ నెంబర్లు ఇచ్చి విభజించాలని డిప్యూటి సిటీ ప్లానర్ హరిదాసును ఆదేశించారు. అనంతరం స్మార్ట్‌సిటీ సమావేశ మందిరంలో ఏఈఆర్వోలు, సూపర్‌వైజర్లు, బీఎల్‌వోలతో వివిధ అంశాలపై సమీక్షించారు. పదికన్నా ఎక్కువ మంది ఒకే డోర్ నంబరులో ఉంటే వారిని గుర్తించాలని సూచించారు. అనంతరం వాస్తవికతను పరిశీలించి వేర్వేరు డోర్ నెంబర్లను ఏర్పాటు చేయాలన్నారు. అలాగే వందేళ్ల వయసున్న ఓటర్లను కూడా విచారించి పరిశీలించాలని సూచించారు. సమావేశంలో అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, డీసీపీ హరిదాసు, ఏసీపీ నాగశాస్త్రులు, సర్వేయర్ ఆచారి, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఈ-స్టాంప్స్ ఎంతో భద్రం

- పారదర్శకత, అక్రమాలకు సెలవు
- లావాదేవీలు ఇక సులభతరం
- దస్తావేజులు ఇక గత చరిత్రే



పెద్దాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

పెద్దాపురం: జగనన్న ప్రభుత్వం వచ్చాక రిజిస్ట్రేషన్లలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుని అవినీతికి చోటు లేకుండా రెవెన్యూ కార్యకలాపాలు సాగుతున్నాయి. ఇకపై ఆస్తుల రిజిస్ట్రేషన్లు, అగ్రిమెంట్లు వాటి కోసం దస్తావేజులు (నాన్-జ్యూడీషియల్ స్టాంపులు) ఉపయోగించాల్సిన అవసరం లేదు. వాటిస్థానే ఈ-స్టాంపులు వచ్చాయి.

ఏటా సగటున 28 వేల స్టాంపు పేపర్ల విక్రయం..

స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో ఏటా సగటున 28 వేల స్టాంపు పేపర్ల విక్రయం జరుగుతోంది. ఈకార్యాలయం పరిధిలో గండేపల్లి, కిర్లంపూడి, జగ్గంపేట, పెద్దాపురం తదితర 23 గ్రామాల రెవెన్యూ కార్యకలాపాలు జరుగుతాయి. వీటికి ఏటా సగటున రూ.10 స్టాంపు పేపర్లు 9 వేలు, రూ.20 స్టాంపులు 4 వేలు, రూ. 50 స్టాంపులు 6 వేలు, రూ.100 స్టాంపు పేపర్లు 9 వేలు విక్రయం జరుతాయి.

లాభాలెన్నో....

- కామన్ సర్వీసు సెంటర్ (సీఎస్‌సీ), ఎంపిక చేయబడిన బ్యాంకుల్లో ఈ-స్టాంపులు లభిస్తాయి.
- నాన్-జ్యుడీషియల్ స్టాంపు పేపర్ల కంటే ఈ-స్టాంపులకు భద్రత ఎక్కువ.
- పాత తేదీలపై స్టాంపుల విక్రయించే అవకాశం ఉండదు. వీటిని ట్యాంపరింగ్ చేయడం అసాధ్యం.
- దస్తావేజుల వ్యవస్థపై ప్రభుత్వ నియంత్రణ ఉండేది కాదు. ఈ-స్టాంపింగ్ వ్యవస్థ పూర్తిగా ప్రభుత్వ అధీనంలో ఉంటుంది.

పారదర్శకతను పెంచేందుకే..



రిజిస్ట్రేషన్, స్టాంప్స్ శాఖలో పారదర్శకతను పెంచేందుకు ఈ-స్టాంపింగ్‌ను ప్రభుత్వం అమలులోకి తెచ్చింది. నాన్-జ్యుడీషియల్ స్టాంపులతో సమాన విలువైన ఈ-స్టాంపులు అందుబాటులో ఉన్నాయి. దస్తావేజుల స్థానంలో ప్రజలు వీటిని ఉపయోగించవచ్చు. దస్తావేజుల కంటే వీటికి భద్రత ఎక్కువ. ప్రతీ ఒక్కరూ ఈ-స్టాంపింగ్‌పై అవగాహన పెంచుకుని, సులువుగా లావాదేవీలు చేసుకునేందుకు చొరవ చూపాలి.

– వెంకటేశ్వరరావు, సబ్ రిజిస్ట్రార్, పెద్దాపురం

ప్రజా సంక్షేమమే పరమావధి

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- కుతుకుడుమిల్లిలో జగనన్న సురక్ష



కుతుకుడుమిల్లిలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న దృశ్యం



విద్యార్థికి సర్టిఫికెట్ అందజేసిన దొరబాబు

కొత్తపల్లి: ప్రజా సంక్షేమమే పరమావధిగా భావిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. మండలంలోని కుతుకుడుమిల్లి శివారు నిదానం దొడ్డిలో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులకు పలు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచి కర్రి చిన్నారావు మాట్లాడుతూ కొత్తపల్లి నుంచి నిదానందొడ్డి గ్రామానికి వచ్చే రోడ్డు పూర్తిగా ధ్వంసం అవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, నిదానందొడ్డిలో ఎంపీపీ పాఠశాల శిథిలావస్థకు చేరిందని, కమ్యూనిటీ హాలు భవనానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. దీనికి ఎమ్మెల్యే స్పందించి, మాట్లాడుతూ రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని, శిథిలావస్థకు చేరిన పాఠశాలకు రెండు అదనపు తరగతి గదులు మంజూరు చేస్తామని, కమ్యూనిటీ భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ లబ్ధిపొందాలని, ప్రభుత్వం అందిస్తున్న ఏ ఒక్క పథకానికి దూరం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం అమలు చేస్తుందన్నారు. అనంతరం కుతుకుడుమిల్లి పంచాయితీలోనే 700 సర్టిఫికెట్లను లబ్ధిదారులకు అందజేశారు. ఎమ్మెల్యేను సర్పంచి చిన్నారావు, ఎంపీటీసీ రాయుడు విష్ణులు శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, గ్రామ సచివాలయాల కన్వీనర్ ఉమ్మిడి జాన్, ఎస్సీ, ఎస్టీ డివిజన్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు బండి దావీదు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు, కొత్తపల్లి, ఎండపల్లి పీఏసీఎస్ అధ్యక్షులు మారిశెట్టి సత్తిబాబు, గుండ్ర రాజబాబు, మండల ప్రత్యేకాధికారి పుష్పామణి, ఎంపీడీఓ అబ్రహం లింకన్, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కార వేదిక

సామర్లకోట: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందించేందుకు జగనన్న సురక్ష ఎంతగానో దోహదపడుతుందని హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. మండల పరిధి ఉండూరు గ్రామంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రభుత్వ పథకాలకు అవసరమైన సర్టిఫికెట్లను ఉచితంగా అందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ పి.నారాయణమూర్తి, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, సర్పంచ్ సత్యాడి ధనలక్ష్మి, ఎంపీడీఓ డి.శ్రీలలిత, తహసీల్దార్ ఎస్ఎల్‌వీ కుమారి, ఈఓ పీఆర్డీ కర్రి హరికృష్ణ సత్యారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు సర్టిఫికెట్లు రైతులకు పాస్ పుస్తకాలు, కౌలు కార్డులు అందజేశారు.

పెద్దాపురం: జగనన్న సురక్ష పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని హౌసింగ్ చైర్మన్ దవులూరి దొరబాబు ప్రజలకు సూచించారు. మంగళవారం ఆనూరులో సర్పంచ్ నూకతాటి అనితారాణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన జడ్పీటీసీ సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, కూనపురెడ్డి స్వామిలతో కలసి పలు ధ్రువపత్రాలను దరఖాస్తు దారులకు అందజేశారు. తహసీల్దార్ జితేంద్ర, ఎంపీడీఓ అశోక్‌కుమార్, గృహ సారథులు మండల కన్వీనర్ గోపు మురళి, ఈఓ పీఆర్డీ మూర్తి, మాజీ ఎంపీటీసీ సింగన త్రిమూర్తులు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనులు వేగవంతం చేయండి



జూనియర్ కళాశాలల్లో నాడు-నేడు పనుల పురోగతిపై సమీక్షిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: జిల్లాలో జూనియర్ కళాశాలల్లో చేపట్టిన నాడు-నేడు పనులు వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లాలోని 14 జూనియర్ కళాశాలల్లో చేపట్టిన నాడు-నేడు పనుల పురోగతిపై సమగ్ర శిక్షా అభియాన్ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షించారు. ఆయా పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.
విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్, డ్రాప్ అవుట్‌లపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ఆర్ఐవో జీవీ నూకరాజు, సమగ్రశిక్ష అభియాన్ సూపరింటెండెంట్ ఇంజనీర్ నటరాజన్, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



ఘటనా స్థలంలో బస్సు, మోటారు సైకిల్

సామర్లకోట: రాంగ్ రూట్‌లో వచ్చిన బస్సు ఢీకొనడంతో కాకినాడ రమణయ్యపేటకు చెందిన ద్విచక్ర వాహన చోదకుడు నక్కా విశ్వనాథం గాయపడ్డారు. సామర్లకోట నుంచి మోటారు సైకిలుపై పిఠాపురం వెళ్తుండగా గాంధీచౌక్‌లో ఈ ప్రమాదం జరిగింది. క్షతగాత్రుడిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై అడపా గరగారావు తెలిపారు.

సమాచార హక్కు ఫిర్యాదుపై విచారణ

కరప: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం వేళంగి గ్రామస్తుడు కుంచే రామచంద్రరావు సమాచార హక్కు చట్టం కింద ఇచ్చిన ఫిర్యాదుపై ఎంపీడీఓ కె.అప్పారావు విచారణ జరిపారు. వేళంగిలో ప్రభుత్వ స్థలాన్ని కొందరు ఆక్రమించి షాపులు నిర్మించారని, ప్రభుత్వ స్థలం ఎంత ఉంది, ఎవరెవరు ఆక్రమించుకున్నదీ, ఆక్రమణలు తొలగించేందుకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారో తెలపాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్యదర్శి పి.శ్రీనివాస్ ఇచ్చిన సమాచారంపై ఫిర్యాదు దారుడు సంతృప్తి చెందకపోవడంతో ఫిర్యాదును ఎంపీడీఓ కార్యాలయానికి పంపారు. ఈ మేరకు ఎంపీడీఓ అప్పారావు ఈ ఫిర్యదుపై పూర్తి విచారణ నిర్వహించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అలాగే పది రోజుల్లో సమాచారం ఇస్తామని రామచంద్రరావుకు ఎంపీడీఓ తెలిపారు.

78 మంది రక్తదానం

కాకినాడ క్రైం: జీజీహెచ్‌లో మంగళవారం రక్తదానం జరిగింది. శానిటేషన్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శానిటేషన్ కాంట్రాక్టర్ గోకేడ రాంబాబు కుమార్తె దివంగత స్వర్ణభారతి జయంతిని పురస్కరించుకుని శానిటేషన్, సెక్యూరిటీ విభాగాల్లో పనిచేస్తున్న 78 మంది సిబ్బంది రక్తదానం చేశారు. సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవి శిబిరాన్ని ప్రారంభించారు. రక్తదాతలకు జిల్లా ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ రమేష్ ప్రశంసా పత్రాలు అందజేశారు. రాంబాబు కుటుంబీకులు జీజీహెచ్‌లోని రోగులు, వారి బంధువులు 300 మందికి అన్నదానం చేశారు.

అల్లూరికి ఘనంగా నివాళి



అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆర్డీఓ రామారావు



గొల్లప్రోలులో అల్లూరికి నివాళులర్పిస్తున్న నగర పంచాయతీ అధికారులు



ఎంపీడీఓ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ



ఉండూరు పంచాయతీ వద్ద అల్లూరికి నివాళులు అర్పించిన దొరబాబు, అధికారులు



పిఠాపురంలో నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

పెద్దాపురం: మన్యెం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని మంగళవారం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆర్డీవో జేఎస్ రామారావు అన్నారు. ఆర్డీవో కార్యాలయంలో సిబ్బందితో ఆయన అల్లూరి చిత్ర పటానికి నివాళులర్పించారు. ఏఓ పద్మజ, డీటీ భానుకుమార్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, ఎంపీడీఓ అశోక్‌కుమార్, ఎంపీడీఓ హిమమహేశ్వరి, పరిపాలనాధికారి సత్యానారాయణ తదితరులు అల్లూరికి నివాళులు అర్పించారు.
పట్టణంలో పాత బస్టాండ్ వద్ద మున్సిపల్ చైర్మన్ బొడ్డు తులసీ మంగ తాయారు, వైస్ చైర్మన్ కనకాల మహాలక్ష్మి, కౌన్సిలర్ విజ్జపు రాజశేఖర్ అల్లూరికి నివాళులర్పించారు. మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, అగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ తదితరులు పాల్గొన్నారు. స్థానిక వరహాలయ్యపేట సీతారామరాజు పార్కు వద్ద డివైఎఫ్ఐ, ఐద్వా, ప్రజా నాట్యమండలి సంయుక్త ఆధ్వర్యంలో యాసలపు రమేష్ అధ్యక్షతన జరిగిన జయంతి సభలో ఐద్వా కార్యదర్శి కూనిరెడ్డి అరుణ తదితరులు పాల్గొన్నారు. ఆనూరులో రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రమేష్ ఆధ్వర్యంలో అల్లూరి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

అల్లూరిని గుర్తించిన ప్రభుత్వం : దవులూరి

సామర్లకోట: విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజును రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి ఆయన పేరున ఒక జిల్లా ఏర్పాటు చేయడమే కాకుండా, గత ఏడాది 30 అడుగుల కాంస్య విగ్రహం ఏర్పాటు చేసిందని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు పేర్కొన్నారు. ఉండూరు పంచాయతీ కార్యాలయం వద్ద సీతారామరాజు చిత్రపటానికి ఆయన మంగళవారం నివాళులు అర్పించారు. తహసీల్దార్ ఎస్ఎల్‌వీ కుమారి, ఎంపీడీఓ డి.శ్రీలలిత, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, సర్పంచ్ సత్యాడి ధనలక్ష్మి, ఈఓ పీఆర్డీ కర్రి హరికృష్ణ సత్యారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అల్లూరి సీతారామరాజు పార్కులో అల్లూరి విగ్రహనికి వార్డు కౌన్సిలర్ నేతల హరిబాబు ఆధ్వర్యంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ ఊబా జాన్‌మోజెస్, కోఆప్షన్ సభ్యుడు దవులూరి సుబ్బారావు నివాళులు అర్పించారు. డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక బళ్లమార్కెట్ సెంటర్‌లో సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు కరణం ప్రసాదరావు నివాళులు అర్పించారు.

పిఠాపురం: స్వాతంత్ర్య సమరయోధుడు విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు పిఠాపురం నియోజకవర్గంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పోలీసు స్టేషన్ వద్ద ఉన్న అల్లూరి విగ్రహానికి ఎస్ఎఫ్ఐ నాయకులు శ్రీకాంత్ సిద్దు, లోవరాజు, వెంకటేష్, ప్రకాష్, శ్రీరామ్ తదితరులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల వెంకట సూర్యనారాయణరాజు, పట్టణ అధ్యక్షుడు పసుపులేటి సత్యనారాయణ, గండి కొండలరావు, తోట ఏడుకొండలు, కర్నీడి తాతీలు, ఏలూరి సూర్యనారాయణ, పలువురు బీజేపీ నేతలు అల్లూరి విగ్రమానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గొల్లప్రోలు నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ సత్యనారాయణ, గంద్రేటి శ్రీరామచంద్రమూర్తి పలువురు అధికారులు ప్రజాప్రతినిధులు అల్లూరి చిత్రపటానికి పూల మాలల వేసి నివాళులర్పించారు.

కొత్తపల్లి: మండలంలో అల్లూరి సీతారామరాజు జయంతిని నిర్వహించారు. సీపీఎం నాగులపల్లి శాఖ ఆధ్వర్యంలో ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి గుర్రాల అప్పారెడ్డి, సీఐటీయూ నాయకులు నాగేశ్వరరావు, సత్యనారాయణ, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.